నమస్తే తెలంగాణ
సోమవారం 4 ఫిబ్రవరి 2013
www.namasthetelangaana.com
మన పత్రిక మన ఆత్మగౌరవం
పేజీలు : 14 + 20
Published Simultaneously from Hyderabad |Karimnagar | Warangal | Khammam | Nalgonda | Mahaboobnagar | Nizamabad |
సంపుటి : 2 | సంచిక : 258 | వెల : రూ. 4 | హైదరాబాద్ |

బంగారంపై రుణాలు
శ్రీరామ్ గోల్డ్ లోన్
షరతులు వర్తిస్తాయి.
వెంటనే సంప్రదించండి :
ఫోన్ : 040-23434462/63
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని

**Namasthe Telangana Date 04/02/2013**

# 'ఇన్‌కాయిస్'కు సందర్శకుల తాకిడి

- ఘనంగా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు
- సునామీ, విపత్తుల తీరుపై విద్యార్థులకు అవగాహన
- సేవలు మరింతగా విస్తరించేందుకు కృషి : సంస్థ డైరెక్టర్ డా.సతీష్‌చంద్రషెనాయ్





ఇన్‌కాయిస్ పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న సంస్థ శాస్త్రవేత్తలు

దుండిగల్, ఫిబ్రవరి 3 (టీ మీడియా) : భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవాకేంద్రం(ఇన్‌కాయిస్) 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగర శివారు కుత్బుల్లాపూర్ మండలం ప్రగతినగర్ సమీపంలో ఉన్న ఈ కేంద్రంలోనికి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులతో పాటు సామాన్య పౌరులు సైతం సందర్శించేందుకు అనుమతించారు. దీంతో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు, సామాన్య పౌరులు ఆదివారం ఇన్‌కాయిస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ సముదాయంలో ఉన్న సునామీ హెచ్చరికల కేంద్రం, సముద్ర జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పసిగట్టే ల్యాబ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ కేంద్రంలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు సందర్శకులకు తాము ఏవిధంగా సునామీని పసిగట్టే విధానాన్ని, సునామీ సంభవించే సమయంలో ముందుగానే మత్స్యకారులకు ఏవిధంగా సమాచారం అందిస్తారనే విషయాలను వివరించారు. అదే విధంగా సముద్రంలో ఎప్పుడు, ఎక్కడ, ఏ ప్రాంతంలో ఎంత ఎత్తులో చేపలు సమృద్ధిగా దొరుకుతాయో ఆ ప్రాంతాలను కంప్యూటర్ మానిటరింగ్ ద్వారా తెలియజేశారు. అదే విధంగా చేపలు సమృద్ధిగా దొరికే ప్రాంతాన్ని (ప్రొటెన్షియ్ ఫిషింగ్ జోన్) కచ్చితంగా గుర్తించే విధానాన్ని సైతం విద్యార్థులకు వివరించారు. సుముద్ర జలాల వేగం, గాలి, దిశ, ఉష్ణోగ్రతల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఏవిధంగా గుర్తిస్తారనే వివరాలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా భారత ప్రజలకు ఇన్‌కాయిస్ గర్వకారణంగా నిలిచిందన్నారు. దేశంతో పాటు శ్రీలంక, పాకిస్తాన్‌లతో సహా మరో 28 దేశాలకు సముద్ర జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పసిగట్టి కచ్చితమైన సమాచారం అందిస్తున్న ఇన్‌కాయిస్ సేవలు అభినందనీయమన్నారు. ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌చంద్రషెనాయ్ మాట్లాడుతూ 13 సంవత్సరాల క్రితం బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఏ)లో ఒక ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఇన్‌కాయిస్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ప్రగతినగర్ సమీపంలోని 60 ఎకరాల స్థలంలో విస్తరించిందన్నారు. భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిత్వ పరిధిలో పని చేసే ఈ కేంద్రం ద్వారా సముద్ర జలాల స్థితిగతులు, సునామీ, భూకంపాల వంటి వాటిని కచ్చితంగా గుర్తిస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రధానంగా సముద్రమార్గంలో చేపల వేటకు వెళ్లే జాలరులకు, తీర ప్రాంతాలలో నివాసముండే ప్రజలకు విపత్తు పొంచి ఉన్న సమయంలో అప్రమత్తం చేస్తున్నామన్నారు. త్వరలో అత్యంత వేగంగా, సమర్థవంతంగా పని చేసే సూపర్ కంప్యూటర్‌ను సమకూర్చుకుని యువ శాస్త్రవేత్తల సహాయంతో ఇన్‌కాయిస్ సేవలను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సునామీల సమయంలో కచ్చితమైన సమాచారాన్ని అందిస్తున్నందకు 2004లో యునెస్కో ఉత్తమ సేవాకేంద్రంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డా.ఎం.రవిచంద్రన్, బి.వి.సత్యనారాయణ, డా.శ్రీనివాసకుమార్, డా.బాలకృష్ణన్ నాయర్, ఇ.పట్టాభిరామారావుతో పాటు సీనియర్ పరిపాలన అధికారి కెకెవి.చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆనందంగా ఉంది



ఇన్‌కాయిస్‌ను సందర్శించడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో శాస్త్రవేత్తగా కావాలనే కోరిక కలుగుతోంది. సామాన్యులకు ఇన్‌కాయిస్ అందిస్తున్న సేవలు అభినందనీయం.

– ఎస్.శాలిని, 10 తరగతి, విజ్ఞాన్ స్కూల్, మదీనగూడ

## సునామీ తీరును తెలుసుకున్నా



సునామీ వచ్చే తీరు, సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు ఏవిధంగా ఇన్‌కాయిస్ ద్వారా సమాచారం అందిస్తున్నారో తెలుసుకున్నా. ఈ సందర్శన మాకు ఎంతో తృప్తినిచ్చింది.

– డి.అనిరుధ్, 9వ తరగతి, తేజస్వీవిద్యారణ్య పాఠశాల, జోడిమెట్ల